# వానప్రస్థం

"ఏవండీ! లేవండీ!" ఆ పిలుపుకు ఉలికిపాటుగా నిద్రలేచాడు గంగాధరం.

"పిల్లాడికి జ్వరంతో ఒళ్ళు కాలిపోతోందండీ!" ఆందోళనగా చెప్పింది రాజమ్మ.

గంగాధరం నిద్రమత్తు పూర్తిగా దిగింది. నుదుటిమీద చేయివేసి చూసి జ్వర తీవ్రతకు కలతచెందాడు.



ఇప్పుడేం చెయ్యటం! వేళకాని వేళ.

రాత్రి ఒంటిగంట కావస్తున్నది. ఎక్కడకు తీసుకెళ్లటం, ఎలా తీసుకెళ్లటం?

సెంటర్ కెళ్లాలంటే మూడు పర్లాంగులు నడవాలి. వెళ్లినా అక్కడ రిక్షాలు వుంటాయన్న గ్యారంటీలేదు.

"ఏంటాలోచిస్తున్నారు? పిల్లాడు అన్నం సరిగా తినలేదు, నలతగా వున్నాడు, ఓసారి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లమని సాయంత్రం చెప్తే విన్నారుగాదు!" రాజమ్మ నిష్ఠూరంగా అంది.

అది నిజమే! అమ్మ, నాన్నల బెంగేమన్నా వచ్చిందేమో అన్నట్లుగా పట్టించు కోలేదు. ఇలా జ్వరం ముంచుకొస్తుందని తను అనుకున్నాడా?

వీధిచివర ఒక రిక్షా అతని గుడిసెవున్నట్లు గుర్తొచ్చింది. చొక్కా వేసుకుని, చేతికర్రందుకుని చీకట్లో తడుముకుంటూ గుడిసెను చేరుకున్నాడు. రోడ్డువారగా నిలబెట్టున్న రిక్షా చూస్తూనే ప్రాణం కుదుటపడింది గంగాధరంకి. అంటే, రిక్షా అతను ఇంట్లోనే వున్నాడన్నమాట!

గుడిసెముందుకెళ్లాడో లేదో వీధి కుక్క ఎగబడింది. చేతికర్రతో అదిలిస్తూ కేకలు పెట్టాడు. ఆ కేకకు రిక్షాఅతని భార్య వచ్చింది.

"అమ్మా! అర్జంటుగా పిల్లాడ్ని ఆసుపత్రికి తీసుకెళ్లాలి. రిక్షా కావాలి".

"ఇప్పుడే డూటీనుండొచ్చి పడుకున్నాడయ్యా!" అని చెప్పిందామె.

"మా తల్లిగదూ! చిన్నబిడ్డ జ్వరంతో ఒళ్లు తెలీకుండా పడున్నాడు. కాస్త లేపమ్మా!" బ్రతిమిలాడాడు. ఐదునిమిషాల్లో రిక్షాఅతను నిద్రలేచి వచ్చాడు.

"తాతయ్యా! ఇప్పుడెక్కడికి?" హడావుడికి జ్యోతికి మెలకువ వచ్చి అడిగింది. రాజమ్మ చెప్పింది. తిరిగి నిద్రలోకి జారింది జ్యోతి.

తనూ హాస్పిటల్‌కెళ్తే బాగుంటుందని రాజమ్మ అనుకుందిగాని ఇంట్లో జ్యోతినొక్కదాన్ని వుంచి ఎలా వెళ్లటం?

గంగాధరం జేబులో డబ్బులేసుకుని, పిల్లాడ్ని భుజానేసుకుని రిక్షాలో బయల్దేరాడు. రాత్రివేళల్లో పనిచేసే ఆసుపత్రి ఎక్కడ వుంటుందనుకుంటే అక్కడకు తీసుకెళ్లమన్నాడు.

రిక్షా అర్ధగంటలో ఒక నర్సింగ్ హోమ్ ముందాగింది. డ్యూటీ నర్స్ టెంపరేచర్ చూసింది. మేడ మీదున్న డాక్టర్ రెసిడెన్స్‌కి ఇంటర్‌కమ్ మెసేజి ఇచ్చింది. పదినిమిషాల్లో డాక్టర్ కిందికి దిగొచ్చాడు.

పరీక్షచేసి సెలైన్ పెట్టించాడు. ఏయే ఇంజక్షన్లు చెయ్యాలో నర్స్‌కు చెప్పాడు.

"కంగారేం లేదు. అవసరమైతే ఉదయం పరీక్షలు చేయిద్దాం" చెప్పివెళ్లాడు డాక్టర్.

రిక్షా అతనికి డబ్బులిచ్చి, ఇంటికెళ్తూనే రాజమ్మకు ఆసుపత్రి వివరంతో పాటు, కంగారేంపడొద్దని చెప్పమని పంపేశాడు. గంగాధరం నిస్సత్తువగా కుర్చీలో కూలబడ్డాడు. పిల్లాడి పరిస్థితి ఆయన్ని ఒక పట్టాన స్థిమితంగా కూర్చోనివ్వటంలేదు.

ఉద్యోగాన్నుంచి రిటైరై మూడేళ్లు కావస్తోంది. రిటైరవుతూ తను అనుకున్నదేంటి? జరుగుతున్నదేంటి? ఎలాంటి బరువు, బాధ్యతలు లేవు గనుక శేష జీవితం ప్రశాంతంగా గడిచి పోతుందని అభిలషించాడు. తను ఆశించినట్లు జరుగుతుందా?

"నాన్నా! చిట్టిబాబుని నాలుగేళ్ల పాటు మీ దగ్గరుంచుకోండి. వాడి దారిన వాడే స్కూలుకు వెళ్లటానికి అలవాటుపడ్డాక మా దగ్గరుంచుకుంటాం" అంటూ ప్రాధేయపడింది కమల.

"పోనీలెండి! మనకూ ఒక వ్యాపకంగా వుంటుంది. వేళ కింత పెట్టి బడికి పంపటమేగా మనం చెయ్యాల్సింది". సానుకూలంగా మాట్లాడింది భార్య. చాకిరీ చెయ్యాల్సినదానికి లేని అభ్యంతరం తన కెందుకుండాలి? భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్థులైతే వచ్చే సమస్యల్లో పిల్లల చదువొకటి. కాదు కూడదంటే కూతురూ, అల్లుడూ నొచ్చుకుంటారు.

చిట్టిబాబుని కాన్వెంట్‌స్కూల్లో చేర్చి వెళ్లింది కూతురు. వాడిక్కడ ఎడ్జస్ట్ కావటానికి నాలుగు నెలలు పైనే పట్టింది. చిట్టిబాబు స్కూలు వాతావరణానికి అలవాటుపడే దాక, రోజూ ఉదయం తీసుకువెళ్లి సాయంత్రం వరకుండి తీసుకొచ్చేవాడు.

పొద్దుటే లేవటం దగ్గరనుంచి స్కూలుకు వెళ్లే వరకు ప్రతిదానికీ పేచీలే! స్నానానికి పేచీ, టిఫినుకు పేచీ, బూట్లు వేసుకోవటానికి పేచీ, రిక్షా ఎక్కటానికి పేచీ... ఏ రోజుకారోజు యజ్ఞం.

రాత్రిళ్లు నిద్రలేచి అకారణంగా ఏడ్వటం! ఒక్కో రోజు ఊరెల్దామంటూ గోల. వాణ్ణి సముదాయించటానికి తల ప్రాణం తోకకు వచ్చేది.

ఈ వయస్సులో పిల్లవాణ్ణి పెంచటమనేది ఒక వ్యాపకంలాంటిది కాదని తామిద్దరికీ అర్థంకావటానికి ఎన్నాళ్లో పట్టలేదు. పిల్లాడికి కావల్సినవి సమకూర్చటానికి చీకటిముఖానే లేచి ఉరుకులు పరుగులు పెట్టాల్సివచ్చేది. చెప్పా పెట్టకుండా వారంలో రెండ్రోజులు ఎగ్గొట్టడం రిక్షావాడికి అలవాటు.

అలాంటప్పుడు తను సైకిల్‌మీద పిల్లాడ్ని దించి సాయంత్రం తీసుకు రావాల్సి వచ్చేది. అసలే ఆర్థ్రయిటిస్! మోకాళ్ల నొప్పులతో నిద్రపట్టదు.

కూతురు వారానికో ఉత్తరం, చిట్టి బాగా చదువుతున్నాడా అంటూ. రోజూ కాన్వెంట్ నుండొచ్చాక కాసేపు ఆటలాడించాలి. స్నానం చేశాక పుస్తకాలు ముందేసి చదువుకు కూర్చోబెట్టాలి. హోమ్ వర్క్ చేయించి ఆ రోజు స్కూల్లో చెప్పిన పాఠాలు వల్లె వేయించాలి. అర్థంగానివి బోధించాలి. చదవటానికి మొరాయిస్తే ఏవో ఆశలు పెట్టి బుజ్జగించాలి.

ఇంతచేసినా చిట్టిబాబు క్లాసులో ఐదారు ర్యాంకుల్లో వుంటున్నాడని కూతురికి బాధ. ఇంకా బాగా చదివించమంటూ వేడికోళ్లు! ఎలాగైతేనేం రెండేళ్ల చదువు అయిందనిపించారు.

హఠాత్తుగా పెద్దకొడుకు రాజేష్, కోడలు మనవరాల్ని తీసుకొచ్చారు. బాగా పేరున్న ఒక రెసిడెన్షియల్ కాలేజీలో జ్యోతిచేత ఎడ్మిషన్ టెస్ట్ రాయించాలన్నారు. "ఇంతదూరం తీసుకొచ్చి చదివించాలట్రా? మీరున్న చోట ఎన్నో కాలేజీలు వున్నాయిగదా!" అడిగాడు తను.

"అవి లెక్కకేగాని ఇక్కడున్నంత స్టాండర్డ్స్ వాటికి లేదు. ఇక్కడ ఎంసెట్ కోచింగ్ బాగుంటుంది" అంటూ ఆ కాలేజీ గతంలో సాధించిన మెడికల్, ఇంజనీరింగ్ సీట్ల వివరాలు ఏకరువు పెట్టాడు.

జ్యోతి ఎడ్మిషన్ టెస్ట్ పాసయిందని తెలిశాక ఇక్కడ చేర్పించదలుచుకుంటున్నట్లు మనసులోని మాట బయటపెట్టారు, కొడుకూ కోడలు.

రెసిడెన్షియల్‌లో చేర్పిస్తారేమో అనుకున్నాడు తను. హాస్టల్ డిసిప్లిన్ బాగుండదని, భోజనం ఒంటికి సరిపడక అనారోగ్యం పాలవుతుందని, తమతో పాటు వుంచుకుంటే డేస్కాలర్‌గా రోజూ కాలేజీకి వెళ్లి వస్తుందని చెప్పారు.

ఎలా కాదనటం? ఇద్దరు పిల్లలతో యాతనవుతుందని చెప్తే అర్థం చేసుకుంటారా? కూతురి బిడ్డలకంటే మా బిడ్డలు ఏ రకంగా తీసిపోయారంటూ నిలదీస్తే? కష్టంలో కష్టం.

జూన్‌లో కాలేజీలు ప్రారంభం కాగానే జ్యోతిని అప్పగించి వెళ్లారు. జ్యోతికి ఏడింటికే కాలేజి. ముసలామె తెల్లవారుఝామున నాలుగ్గంటలకల్లా లేచి పనికి ఉపక్రమించితేగాని తెమలటంలేదు.

చదువులంటే వేళకింత తిండి పడేసి పిల్లల్ని స్కూలుకు పంపటమేనా? ఎన్ని రకాల ఇబ్బందులు! టిఫిన్ దగ్గర్నుండి కూరలదాకా అన్నీ గొడవలే! జ్యోతికి ఇడ్లీ నచ్చితే, చిట్టికి పూరీ కావాలి. ఏదోటిలెమ్మని వేళకింత చేసిపడేస్తుంటే నానా రభస! అలుగుళ్లు, పోట్లాటలు. కూరల దగ్గరా అంతే! ఇద్దరూ ఏదో వంకతో కీచులాటలు, కొట్లాటలు. తగూలు తీర్చటానికి తల బొప్పికడుతున్నది.

"తాతయ్యా! కాలేజి దగ్గర రౌడీమూక వెంటపడి అల్లరిపెడుతోంది" జ్యోతి ఫిర్యాదు చేసింది.

"అలాంటివి పట్టించుకోకమ్మా! వాళ్లదారిన వాళ్లే వెళ్లిపోతారు" అంటూ సర్దిచెప్ప బోయాడు.

ఒకరోజు మొండికెత్తింది. "నేను వెళ్లను తాతయ్యా! నిక్‌నేమ్స్ పెట్టి ఏడిపిస్తున్నారు. సైకిల్‌కు అడ్డం వచ్చి పడేస్తున్నారు" ఏడ్చింది జ్యోతి.

జ్యోతిని రోజూ కాలేజీకి తీసుకువెళ్ళి, తీసుకురాక తప్పటంలేదు. తాతయ్య కూచి అంటూ దాన్ని ఏడిపించటం మొదలెట్టారు. రౌడీమూక అల్లరి మితిమీరి రెండుమూడుసార్లు మందలించాడు. లెక్కుంటేగదా! ఆడపిల్లలను కన్నవాళ్ళకు ఒకప్పుడు ఒకటే సమస్యగా

వుండేది, అది పెళ్లి! ఇప్పుడు ఆడపిల్లను పెళ్లి చేసేదాకా రక్షించుకోవటం మరో కొత్త సమస్య అయింది.

ఇటు తనకూ అటు భార్యకూ వయసుకు తగిన విశ్రాంతి దొరకక కాబోలు ఒంట్లో బాగుండటంలేదు.

మేం ఎంత డబ్బయినా ఇస్తాం, మంచి పనిమనిషిని చూసి పెట్టుకోమంటూ కంటితుడుపు సానుభూతులు. ఖర్చు గురించి ఎవరు బాధపడుతున్నారు గనుక! పనివాళ్లు ఇష్టమున్న రోజు వస్తారు కష్టమనుకున్న రోజు మానేస్తారు.

వాళ్లు ఎగ్గొట్టిన రోజు బండెడు చాకిరీ భార్యకు తప్పటంలేదు.

తెల్లార్లు నిరంతరాయంగా సాగుతున్న గంగాధరం ఆలోచనలకు నర్సురాకతో తెరబడింది. టెంపరేచర్ చూసింది. నూటొకటుంది, జ్వరం తగ్గుముఖం పడ్తున్నదని చెప్పింది. గంగాధరం మనసుకు కాస్త నిశ్చింత!

మూడో రోజుకి చిట్టిబాబుని డిశ్చార్జి చేశారు. ఇంటికి, హాస్పిటల్‌కు తిరగలేక రాజమ్మ నానా హైరానా పడింది. వేళకు తిండి, నిద్ర కరువైంది.

చిట్టిబాబు నాలుగురోజుల్లో కోలుకొని కాన్వెంట్‌కు వెళ్లసాగాడు.

ఒకరోజు రాజమ్మ పనిచేసుకుంటున్నదల్లా వున్నపళంగా కూలబడి పోయింది. గంగాధరం ఆసుపత్రికి తీసుకెళ్లాడు. డాక్టర్ పరీక్షచేసి బి.పి. వుందని మందులు రాసిచ్చాడు. బాగా విశ్రాంతి తీసుకోవాలని చెప్పాడు.

విశ్రాంతి! ఎలా కుదురుతుంది? రాజమ్మకు పొద్దుట్నించీ ఒకటేపని. ఒంట్లో బాగున్నా, బాగోకున్నా పనులన్నీ నిమిషాలమీద జరిగిపోవాలి. నింపాదిగా చేసుకునే వీలులేదు.

గంగాధరం కూతురికి కబురుపెట్టాడు, అమ్మకు అనారోగ్యమనీ, వారంపది రోజులుండి వెళ్లవలసిందని. సెలవు దొరకదనీ, వదినను పిలిపించమనీ సమాధానం. తనకు అసలే వీలుపడదనీ ఆడ పడుచునే వచ్చి పదిరోజులుండి పొమ్మని కోడలి జవాబు. చివరకు ఎవరూ రాలేదు.

నాలుగు రోజులు తిండీతిప్పలకి హోటళ్లను ఆశ్రయించక తప్పలేదు. మెస్‌నుండి కూరలు తెచ్చారు. గంగాధరం తనే రైస్‌కుక్కర్ పెట్టి అన్నం ఉడికించాడు. "ఛీ! తూ!" అంటూ పిల్లలు ఏదీ సరిగా తినకుండా అవతల పారేసి పోతున్నారు. పరిస్థితుల్ని అర్థం చేసుకునే వయస్సు వాళ్లకు లేదు.

ఇదంతా గమనించి, రాజమ్మ తనే వంట చేసుకోవటం మొదలెట్టింది. గంగాధరం వారిస్తున్నా విన్లేదు. అంతకన్నా గత్యంతరం మాత్రం ఏముం ది? భార్యకు చేదోడు వాదోడుగా ఆమెను అంటిపెట్టుకుని వుండసాగాడు.

అటు కూతురుగాని, ఇటు కోడలుగాని సాయానికి రాకపోవటానికిగల కారణం గంగాధరానికి అర్థమైంది. తన కొడుకేనా వుంటుందని కూతురు, తన కూతురేనా వుంటుందని కోడలు వంతులేసుకుని ఎవరూ రాకుండా పోయారు.

రాజమ్మ ఆరోగ్యం బాగుండటం లేదని ఎలా తెలిసిందో చిన్నకొడుకూ కోడలూ వచ్చి వెళ్లారు. వయసు, ఓపిక చూడకుండా పిల్లల బరువు తలకెత్తటమేంటని వాపోయారు. పెద్దకోడలు వంతుపెట్టుకొని జ్యోతిని పెట్టిందని రుసురుసలాడింది చిన్నకోడలు. ఆ మాటలకు గంగాధరం, రాజమ్మలు ఏం మాట్లాడలేకపోయారు.

ఇల్లు కట్టుకోవటానికి లోన్ కోసం ప్రయత్నిస్తున్నానని, లోన్ శాంక్షన్ కాగానే ఇల్లు మొదలెడ్తానని తండ్రి చెవినేసి వెళ్లాడు చిన్నకొడుకు. ముసలివాళ్లిద్దరూ సంతోషించారు.

వీలుచేసుకుని ఒకసారి కూతురు, అల్లుడు, పెద్ద కొడుకు, కోడలూ విడివిడిగా వచ్చి నాలుగురోజులుండి వెళ్లారు. ఉన్న నాలుగు రోజులు పిల్లల సౌకర్యాల గురించి, చదువుల గురించి ఆరాలేగాని తల్లిదండ్రుల కష్టసుఖాల గురించి వాళ్లకే మాత్రం పట్టలేదు.

రాజమ్మ అనారోగ్యం గురించి గంగాధరం వాళ్ల దగ్గర ప్రస్తావించాడు. వయసు మీదపడుతున్న కొద్దీ రోగాలు తప్పేవికావంటూ డాక్టర్‌కు చూపించి మందులు వాడమని సలహాలిచ్చారు. అంతేకాని పనిభారం ఆవిడ ఆరోగ్యాన్ని కృంగదీస్తుందేమోనన్న కించిత్తు ఆలోచన వాళ్లకు రాలేదు.

గంగాధరానికి తరచూ తల తిరుగుతున్నట్లనిపించి డాక్టర్‌కి చూపెట్టాడు. బి.పి.లక్షణాలని మందులు రాశాడు. తగిన విశ్రాంతితో పాటు మనసు ప్రశాంతంగా వుండేలా చూసుకోవాలన్నాడు.

మార్చి నెలాఖర్లో చిన్న కొడుకు వచ్చాడు. వచ్చే ఆదివారం శంకుస్థాపనని, ఇల్లు కట్టుబడి అయ్యేవరకు దగ్గరుండి చూసుకునే మనిషి కావాలనీ, తల్లీదండ్రీ అక్కడికొచ్చి కొంతకాలం తమతో వుండిపోవాలన్నాడు.

"ఏదో ఆ శుభసమయానికి వచ్చి నాలుగైదు రోజులంటే వుండగలం కానీ నెలల తరబడి అక్కడ వుండటం మావల్ల అయ్యేపని కాదు" అంటూ అభ్యంతరం చెప్పాడు గంగాధరం.

తల్లిదండ్రుల మీద ఇంతెత్తున లేచాడు చిన్న కొడుకు. "అవును! మీకు కూతురు, పెద్ద కొడుకుపాటి నేనూ, నా పెళ్లాం, పిల్లలు కాకుండా పోయాం. మా మంచిచెడులు మీకు అక్కర్లేదు" అంటూ చిందులు తొక్కాడు.

తమ అనారోగ్యం గురించి, ఇబ్బందులు గురించి గంగాధరం చిన్నకొడుక్కి చెప్పే ప్రయత్నం చేశాడు. అవేమీ వినిపించుకోలేదు అతను.

"మీ బిడ్డల్లో నేనూ ఒకడ్ననుకుంటే నాకు సాయపడండి. మీకు నేనేం కాకపోయినా ఫర్లేదనుకుంటే నా గురించి మర్చిపోండి" అంటూ తండ్రినీ, తల్లినీ నానా రకాల మాటలని వెళ్లాడు.

రాజమ్మ చిన్నకొడుకు మాటలకు ఏడ్చింది. "ఏవండీ! ఈ రోజు వాడి అక్కర తీర్చలేకపోయినంత మాత్రాన వాడికి మనం ఏంకాకుండా పోతామా! మరి ఇంతకాలం చేసిందంతా మర్చిపోతాడా?" అంటూ గొల్లుమన్నది.

భార్యను ఓదార్చడానికి గంగాధరం కిందుమీదయ్యేడు. అసలు ఏమిటీ గందరగోళం? ఈ పంతాలు, నిష్ఠూరాలు, నిందలు ఏంటసలు?

ఎలాంటి బరువు బాధ్యతలు లేకుండా, ప్రశాంతంగా రామా, కృష్ణా అనుకుంటూ రోజులు గడపాల్సిన వయసులో ఈ బాదరబందీలు, మానసిక క్షోభ ఏమిటి?

బిడ్డల్ని కని, పాతికేళ్లపాటు పెంచి, పోషించి, చదువులు చెప్పించి, వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడేలా తీర్చిదిద్దినందుకు దక్కిన ప్రతిఫలం ఏమిటి?

సుదీర్ఘకాలం వాళ్లకోసం పడ్డ కష్టాలకు బిడ్డలు తమపట్ల చూపుతున్న కృతజ్ఞత ఏపాటిది? తమ బిడ్డలయినందుకు వాళ్లకు, వాళ్లు కన్న బిడ్డలకు బ్రతికినంతకాలం ఊడిగంచేస్తూ జీవచ్ఛవాల్లా బ్రతకాల్సిందేనా? కుటుంబంలోని వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలకు అదేనా కొలబద్ద? జీవిత చరమాంకంలో కూడా తమకోసం తాము ప్రశాంతంగా బ్రతికే అవకాశం లేదా? సమస్య పరిష్కారం కోసం గంగాధరం రోజులతరబడి ఆలోచిస్తూనే వున్నాడు.

ఆయేటికి పిల్లల పరీక్షలై పోయాయి. పిల్లల్ని సెలవులకు తీసుకెళ్లటానికని కూతురూ, పెద్దకొడుకూ వచ్చారు.

"వచ్చేయేడు పిల్లల చదువుగురించి మీ ఏర్పాట్లేవో మీరు చేసుకోండి. ఏవిధమైన బరువుబాధ్యతలు తలకెత్తుకునే ఓపిక మాకు లేదు. మిమ్మల్ని కన్నందుకు మీ జీవితాలకు ఒకదారి ఏర్పడేదాకా చేయందించాం. ఇక బ్రతికిన నాలుగు రోజులు ప్రశాంతంగా బ్రతికే అవకాశాన్ని మాకు ఇవ్వండి. ఇంతకుమించిన సహాయాన్ని మీ నుంచి మేం ఆశించటం లేదు". నిర్దిష్టంగా చెప్పాడు గంగాధరం. తండ్రి మాటలకు కూతురు, కోడలు నిర్ఘాంతపోయారు.

*(స్వాతి సపరివార పత్రిక, 29.01.1999)*